ఏళ్లుగా ఎదురుచూపులే..!

- గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణంలో జాప్యం
- మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



సల్యాదకు వెళ్లే రోడ్డు దుస్థితి

ఇచ్చోడ: గిరిజన గ్రామాల ప్రజలు బీటీ రోడ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమైనట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నట్లు వాపోతున్నారురు.

ప్రారంభం కాని పనులు..

మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన పెద్ద సల్యాదకు మల్యాల్ నుంచి సల్యాద వరకు రెండు కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణం కోసం రూ. 2 కోట్ల నిధులను ప్రభుత్వం గత ఏడాది మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాదైనా ఈ రోజు వరకు పనులు ప్రారంభించ లేదు. రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో ప్రజలు సంబురపడ్డారు. దారి కష్టాలు తీరి ఎన్నో ఏళ్ల కళ నెరవెరుతుందని ఆశపడ్డారు. కానీ ఏడాది కాలంగా పనులు ప్రారంభకాక పోవడంతో రోడ్డు నిర్మాణంపై ఆశలు వదులుకున్నారు.

పనులు ప్రారంభించాలి



ఏడాది కిందట రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాది కాలం నుంచి పనులు ప్రారంభించ లేదు. ఐటీడీఏ అధికారులు. ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– తోడసం లక్ష్మణ్, సల్యాద

ఆదివాసీ గ్రామాలను పట్టించుకోవాలి



ఆదివాసీ గ్రామాలను ప్రభుత్వం పట్టించుకోవాలి. ఆదివాసీ గ్రామాలకు మంజూరు చేసిన రోడ్ల కోసం నిధులను వెంటనే విడుదల చేయాలి. నిధులు మంజూరు కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కనీస మౌలిక వసతులు కలిపించ లేదు.

– జుగ్నక్ మానిక్‌రావు, సల్యాద

చర్యలు తీసుకుంటాం

గతంలో చేసిన పనులకు బిల్లులు రాక పోవడంతో సదరు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించ లేదు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం

– సుధాకర్, ఐటీడీఏ ఏఈ

నారాయణబాబా బోధనలు ఆచరణీయం



పూజ కార్యక్రమంలో పాల్గొన్న యోగానంద సరస్వతి

తాంసి: గ్రామాల్లో ప్రజలను చైతన్య చేస్తూ.. ప్రజలను ఆధ్యాత్మికతను అలవర్చిన మహనీయుడు నారాయణబాబా బోధనలు ఆచరణీయమని గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. ఆదివారం మండలంలోని వామన్‌నగర్ గ్రామంలో సంత్‌శ్రీ సద్గురు నారాయణబాబా సంస్థాన్‌లో 22వ అఖండ హరినామా యజ్ఞం నిర్వహించారు. మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు భక్తిభావం, సేవాగుణం అలవర్చేందుకు తనవంతుగా కృషి చేశారన్నారు. బాబా శిష్యులు ఆయన సేవలను నేటికి కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు పోచ్చన్న, మారుతిపటేల్, భూమారెడ్డి, గడ్డం గంగారెడ్డి, అశోక్, రజనీకాంత్ రెడ్డి, నాగారెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న కోత షురూ



సిరికొండ మండల వ్యాప్తంగా మొక్కజొన్న పంట కోతకు రావడంతో రైతులు హార్వేస్టర్లను ఆశ్రయిస్తున్నారు. మండల వ్యాప్తంగా మొక్కజొన్న కోత మొదలైంది. దీంతో ఎక్కడ చూసినా.. హార్వేస్టర్లు దర్శనమిస్తున్నాయి. – సిరికొండ

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం



నేరడిగొండ మండలంలోని మాదాపూర్ గ్రామానికి వెళ్లే వంతెన సమీపంలో రోడ్డు అసంపూర్తిగా ఉంది. కాంట్రాక్టర్ కొంతమేర వేసి మరికొంత వేయకపోవడంతో ఆ దారిగుండా వెళ్లే వాగ్దారి, వెంకటాపూర్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – నేరడిగొండ

భగీరథ నీరు లీకేజీ



నేరడిగొండ మండలంలోని పీచర గ్రామానికి వెళ్లే మిషన్ భగీరథ నీరు మార్గ మధ్యలో లీకేజీ అవుతుంది. గ్రామంతో పాటు అద్దాల తిమ్మాపూర్, లక్ష్మిపూర్ గ్రామస్తులకు నీటి తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజ్ అవుతున్న పైపులైన్‌ను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. – నేరడిగొండ

క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో రూ. 10 లక్షల నిధులతో మంజూరైన సీసీరోడ్డు పనులను ఆదివారం గ్రామస్తులు ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామస్తుల ఆధ్వర్యంలో సీసీరోడ్డు పనులు చేపట్టనున్నట్లు గ్రామపటేల్ కినక లచ్చు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆత్రం శేకు, మెస్రం సోమేశ్వర్, పెందోర్ దేవ్‌రావ్, కినక జుగాదిరావ్, కొట్నాక్ సంతోష్, మెస్రం జల్పత్ రావ్ పాల్గొన్నారు.

ప్రహరీ మరమ్మతుల కోసం సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు చుట్టూ ఉన్న ప్రహరీ గతంలో భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయింది. కాగా.. ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు సర్వే చేపట్టారు. నివేదిక తయారు చేసి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి పంపిస్తామని ఏఎంసీ కార్యదర్శి జల్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర



పూజలు చేస్తున్న ఆడె గజేందర్

బోథ్: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో భీమన్న ఆలయ జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు సౌకర్యార్థం రూ. 4 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో షెడ్ నిర్మాణం చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పోచ్చన్న

తాంసి: మండల కేంద్రానికి చెందిన కోట్రంగి అశోక్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోరుతున్నాడు. బాధితుడికి వైద్యం కోసం గ్రామానికి చెందిన గుగ్గిల పోచ్చన్న ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశాడు. ఆయన వెంట గ్రామపెద్దలు యశ్వంత్, రజనీకాంత్, శ్రీకాంత్, రమాకాంత్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఖానాపూర్: ఈనెల5 నుంచి జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ హమీద్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 290 మంది, రెండో సంవత్సరంలో 268 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 8:30 గంటల్లోపే చేరుకోవాలని.. 8:45 గంటల తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని పేర్కొన్నారు.

సుర్జాపూర్ విద్యార్థుల విహారయాత్ర



విహారయాత్రలో విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఆదివారం విహారయాత్ర కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వెళ్లారు. వెయ్యిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, లక్నవరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల విశిష్టతను ఉపాధ్యాయులు.. విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఊర్మిళ, ఉపాధ్యాయులు దురిశెట్టి శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, సౌజన్య, లక్ష్మి, లచ్చన్న తదితరులు ఉన్నారు.

అదుపు తప్పితే అంతే..



వాహనాలు కొంచం రోడ్డు అంచుకు వస్తే ఇక అంతే సంగతి. మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలో ఇచ్చోడ వెళ్లే రోడ్డు అంచు పూర్తిగా మట్టి కొట్టుకుపోవడం వాహనం వెళ్లే కూలే అవకాశం ఉంది. పక్కనే పెద్ద గుంత ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. – సిరికొండ


అధికారుల నిర్లక్ష్యం



నేరడిగొండ మండలంలోని పీచర గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. వారం రోజులైన సంబంధిత అధికారులు మాత్రం దానిని సరి చేయడం లేదు. దీంతో గ్రామస్తులు కరెంటోళ్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – నేరడిగొండ

ఉపాధికి ఉందో యాప్

- 'జన్‌మన్‌రేగా'తో మేలు
- సమగ్ర వివరాలు తెలుసుకునే అవకాశం



'జన్‌మన్‌రేగా' యాప్



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

నేరడిగొండ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీలకు డబ్బులు చెల్లింపులో అనేక మార్పులు జరుగుతున్నాయి. పారదర్శకతకు బ్యాంకు, తపాలా ఖాతాల్లో కూలీల నగదు జమ చేస్తున్నారు. కొందరి ఖాతాల వివరాలు సరిగా అనుసంధానం కాకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్‌రేగా' యాప్ ఎను ఆవిష్కరించింది. ఇందులో సమగ్ర వివరాలను తెలుసుకునే వీలుంది. జిల్లాలో 1లక్ష 67 వేల పైచిలుకు జాబ్‌కార్డులున్నాయి. 3 లక్షల 38 వేల పై చిలుకు కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు.

పారదర్శకతకు పెద్దపీట..

ఉపాధిహామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది. ఫోన్‌లో జన్‌మన్‌రేగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల హాజరు, నగదు జమ, విభాగం క్లిక్ చేస్తే సంబంధిత సమాచారం తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. కూలీ డబ్బులు జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. మరోవైపు పథకంలో చేపట్టే పనుల సమాచారం, స్థానిక అక్రమాలపై ఫిర్యాదులకు అవకాశం కూడా కల్పించారు. అంతే కాకుండా యాప్‌లో అన్ని భాషల్లో వివరాలు ఉంటాయి.

అవగాహన అవసరం..

ఇప్పటివరకు చాలా మంది కూలీ డబ్బుల విషయంలో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌పై అవగాహన కల్పిస్తే వారికి మరింత ప్రయోజనకరంగా మారనుంది. ఈమేరకు సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించేలా చొరవ చూపాలి.

సద్వినియోగం చేసుకోవాలి..



జన్‌మన్‌రేగా యాప్ వినియోగంతో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. కూలీలు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడకుండా యాప్ ఎంతగానో దోహద పడుతుంది. గ్రామ సభల్లో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. స్థానిక అక్రమాలపై కూడా యాప్‌లో ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది.

– వసంత్ రావు, ఈజీఎస్ ఏపీవో, నేరడిగొండ

వ్యవసాయానికి యువత దూరం



ఈఫొటోలో ఉన్న యువరైతు పేరు దత్తు. తలమడుగు మండలంలోని అర్లి గ్రామంలో తల్లితండ్రుల నుంచి సక్రమంచిన రెండు ఎకరాల్లో వ్యవసాయం చేశాడు. రెండు ఎకరాల సాగుతో వచ్చిన ఆదాయంపై సరిపోక నాలుగు లక్షలకు పైగా అప్పు చేశాడు. వ్యవసాయంపై అప్పు తీర్చలేక గత్యంతరంలేని పరిస్థితుల్లో బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లాడు. జిల్లాలో ఇలాంటి యువ రైతులు వేల సంఖ్యలో ఉన్నారు.

- పెట్టుబడులకు తగిన ఆదాయం రాక అప్పుల పాలు
- తగ్గుతున్న దిగుబడులు
- ప్రత్యామ్నాయ ఉపాధి వైపు అడుగులు



మర్లపెల్లిలో వంకాయ సాగు చేస్తున్న యువ రైతు

ఇచ్చోడ: జిల్లాలో ప్రతీ ఏటాకు వ్యవసాయానికి యువ రైతులు దూరమవుతున్నారు. పెట్టిన పెట్టుబడులకు తగిన ఆదాయం రాక అప్పుల పాలు కావడం, ప్రతీ సంవత్సరం పంటలు చేతికొచ్చే సమయానికి వాతావరణంలో వస్తున్న అనిశ్చితి కారణంగా భారీగా పెరుగుతున్న పెట్టుబడులు, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల వైపు చూస్తున్నారు. పట్టణాల్లో చిన్నపాటి ఉద్యోగాలు, వ్యాపారాలకు ప్రాధాన్యత ఇస్తూ.. వ్యవసాయ రంగాన్ని వీడుతున్నారు.

చిన్న కమతాలే ఎక్కువ..

జిల్లాలో 1,63,359 మంది రైతులు ఉన్నారు. ఇందులో 1,28,650 మంది చిన్నకారు రైతులు, 30,607 మంది సన్నకారు రైతులు, 3,832 మంది మధ్యతరహ రైతులు, 270 మంది పెద్ద భూకమతల రైతులున్నారు. జిల్లాలో ఉన్న రైతుల్లో 76 శాతం రైతులు చిన్నకారు రైతులే. కుటుంబాల విభజనతో భూముల పంపకాలతో చిన్నకమతాలు పెరగడం, చిన్న కమతాల్లో అత్యధికంగా యువ రైతులే సాగు చేస్తున్నారు. జిల్లాలో 1లక్ష 28 వేల పై చిలుకు ఉన్న చిన్నకారు రైతుల్లో 80 శాతం అంటే దాదాపుగా 85 వేల వరకు యువ రైతులు ఉన్నట్లు సమాచారు.

తగ్గుతున్న ఆదాయం...

చిన్న కమతాల సాగుతో ఆదాయం తగ్గుతుంది. పంటలపై పెట్టిన పెట్టుబడుల రాక, ఆదాయం రాక పోవడంతో చాలా మంది యువ రైతులు అప్పుల పాలవుతున్నారు. తక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం చేయడం ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక వాతావారణంలో అనిశ్చితి మెజార్టీ రైతులకు వ్యవసాయానికి సాగు నీరు లేక పోవడంతో రబీ సీజన్‌లో ఒకే పంటతో సరిపెట్టుకోవడంతో చిన్న కమతాల వ్యవసాయంపై ఆదాయం భారీగా తగ్గుతు వస్తోంది.

ఆధునిక పద్ధతిలో సాగు చేయాలి

విత్తన ఉత్పత్తి వైపు యువ రైతులు అడుగులు వేయాలి. జిల్లాలో అనేక వనరులు ఉన్నాయి. వాటిని వినియోగించుకునేందుకు కృషి చేయాలి. ఆధునిక పద్ధతిలో వంగడాలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కకవచ్చు.

– శ్రీధర్ చౌహాన్, అసోసియట్ డీన్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆదిలాబాద్

రైతులకు శిక్షణ ఇవ్వాలి



జిల్లా వ్యాప్తంగా ఆరు తడి పంటల సాగుతో పాటు, నూతన పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసే విధంగా ప్రతీ సంవత్సరం యువ రైతులకు ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇవ్వాలి, పాలీహౌస్, బిందు సేద్యం ద్వారా పండించే విత్తనాలను సబ్సిడీ ద్వారా అందించాలి.

– సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు